

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
మంగళవారం 14 అక్టోబరు 2025



చేతులు కలిసేదెప్పుడో!?



చిచ్చు రేపుతున్న మేడారం మహాజాతర అభివృద్ధి పనులు

- టెండర్ల విషయంలో మంత్రులు కొండా, పొంగులేటి మధ్య విభేదాలు
- సమస్య పరిష్కరించాలంటూ టీపీసీసీ చీఫ్‌కు మంత్రి సీతక్క లేఖ
- తాజాగా దేవాదాయ శాఖ మంత్రి సురేఖ లేకుండానే మంత్రులు పొంగులేటి, సీతక్క సమీక్ష
- గత జాతర సమయంలోనూ మంత్రుల మధ్య మనస్పర్థలు
- ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య ఇంకా కొనసాగుతూనే ఉన్న పాత విభేదాలు
- అధిష్ఠానం జోక్యం చేసుకున్నా కుదరని సయోధ్య

7

అధికార పార్టీలో మంత్రులు, ఎమ్మెల్యేలు, కీలక నేతల మధ్య విభేదాలు ఎంతకీ ఆగడం లేదు. ఏదో ఒక విషయంలో రచ్చ చోటుచేసుకుంటుండటంతో అటు పార్టీ వర్గాలు, ఇటు ప్రజల్లో ప్రజా ప్రతినిధుల తీరు చర్చనీయాంశంగా మారుతోంది. ఉమ్మడి జిల్లాలో మొన్నటి వరకు ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య పెద్ద యుద్ధమే జరిగింది. అధిష్ఠానం జోక్యంతో సమస్య సద్దుమణిగినా, నేతలు మాత్రం ఐక్యంగా ముందుకు సాగడం లేదనే టాక్ వినబడుతోంది. తాజాగా మేడారం జాతర టెండర్ల విషయంలో మంత్రుల మధ్య విభేదాలు రచ్చకెక్కాయి. దేవాదాయశాఖ టెండర్ల విషయంలో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి తీరుపై మంత్రి కొండా సురేఖ అసంతృప్తితో కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారనే ప్రచారం హట్‌టాపిక్‌గా మారింది. సోమవారం మేడారంలో మంత్రులు పొంగులేటి, సీతక్క పర్యటించగా, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ మాత్రం కనిపించలేదు. ఆహ్వానం అందకపోవడం వల్లే ఆమె రాలేదని తెలుస్తోంది. గత మేడారం మహాజాతర సమయంలోనూ మంత్రుల మధ్య విభేదాలు అంతర్గత రచ్చచేశాయి. మరో మూడు నెలల్లో మహాజాతర జరగనుండగా... అక్కడ చేపట్టిన అభివృద్ధి పనులు, ఏర్పాట్లపై ఈ అంతర్గత పోరు ఎలాంటి ప్రభావం చూపుతుందోనని ఆందోళన భక్తుల్లో వ్యక్తమవుతోంది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



మేడారం పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రులు, అధికారులు

పక్కా ప్రణాళికతో మేడారం పనులు

- పటిష్ఠంగా మాస్టర్‌ప్లాన్ అమలు
- 90 రోజుల్లో పూర్తి చేస్తాం
- మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క
- మేడారం గద్దెల ప్రాంగణం అభివృద్ధి పనుల పరిశీలన
- సమ్మక్క- సారలమ్మలకు ప్రత్యేక పూజలు
- అధికారులతో సమీక్ష సమావేశం

8



కేసముద్రం మార్కెట్‌లో మక్కలు తడవకుండా కప్పిన టార్పాలిన్లు



తొర్రూరు హచ్చుతండాలో నేలవాలిన వరి



కొత్తగూడలో ప్రవహిస్తున్న బూర్కపల్లి వాగు

ఉరుములు.. మెరుపులు

- భారీ శబ్దాలతో దద్దరిల్లిన గ్రామాలు
- భయబ్రాంతులకు గురైన ప్రజలు
- రాత్రంతా ప్రజలకు నిద్ర కరువు
- కురవి, మహబూబాబాద్‌లో భారీ వర్షం
- పొంగుతున్న వాగులు.. రాకపోకలు నిలిపివేత

జిల్లాలో దంచికొట్టిన వాన

మహబూబాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎన్నడు లేనంతగా భారీ ఉరుములు.. మెరుపుల శబ్దాలతో వర్షం కురిసింది. కేసముద్రం, డోర్నకల్, మహబూబాబాద్, కురవి, గార్ల, నెల్లికుదురుతో పాటు పలు మండలాల్లో ఆదివారం రాత్రి దడేల్.. దడేల్‌మంటూ భారీ ఉరుములు, మెరుపులు రావడంతో ప్రజలు భయబ్రాంతులకు గురయ్యారు. తమపైనే పిడుగులు పడుతున్నట్లుగా భారీగా శబ్దాలు రావడంతో ప్రజలకు రాత్రంత నిదుర కరువైంది. కురవిలో 132.4, మహబూబాబాద్‌లో 109.6 మిల్లీమీటర్ల అతిభారీ వర్షం కురిసింది. కేసముద్రం, కొత్తగూడ, గార్ల, గూడూరు, డోర్నకల్ మండలాల్లో వాగులు పొంగిప్రవహిస్తున్నాయి. కొత్తగూడ మండలంలోని బూర్కవాగు, గాంధీనగర్‌వాగు, కేసముద్రం మండలంలోని వట్టివాగు, గార్ల మండలంలోని పాకాల వాగు పొంగిప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సోమవారం మధ్యాహ్నం వర్షం ఉధృతి తగ్గడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. గార్ల పాకాల వాగు ఉధృతంగానే ప్రవహిస్తుండడంతో రాంపురం, మద్దివంచ, పులిగుట్టతండ, కొత్తతండ, హన్మతండ, రాముతండ, గొల్లచర్ల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.



కొత్తగూడలో ప్రవహిస్తున్న గాంధీనగర్ వాగు

జిల్లాలో ఇలా..

కేసముద్రం మార్కెట్ ఆవరణలో చాలా మంది రైతులు మొక్కజొన్నలను ఆరబెట్టుకున్నారు. అయితే టార్పాలిన్‌లు కప్పుకున్నప్పటికి వరద ఉధృతికి కొంతభాగం మక్కలు కొట్టుకుపోయాయి. అర్పనపల్లి సమీపంలోని వట్టివాగు లోలెవల్ బ్రిడ్జి వంతెనపై నుంచి ప్రవహిస్తుండడంతో ఎస్సై క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో పోలీసులు, గ్రామపంచాయతీ సిబ్బందిని ఏర్పాటు చేశారు. గూడూరు-అర్పనపల్లి, కాట్రపల్లి వైపు రాకపోకలు నిలిపివేశారు. కొత్తగూడ మండలంలోని బూర్కపల్లివాగు, గాంధీనగర్‌వాగు రాత్రి కురిసిన వర్షానికి ఉధృతంగా ప్రవహించాయి. పలు గ్రామాలకు రాకపోకలు నిలిపివేయగా మధ్యాహ్నం వర్షం తగ్గుముఖం పట్టడంతో యథావిధిగా రాకపోకలు కొనసాగాయి. గూడూరు మండలంలోని వడ్డెరగూడెం సమీపంలో కాజ్‌వేపై నుంచి ఉధృతంగా నీరు ప్రవహిస్తుండడంతో బొల్లెపల్లి వెళ్లే ప్రజలకు అంతరాయం ఏర్పడింది. పాకాలవాగు బ్రిడ్జికి అనుకుని వరద ఉధృతి ప్రవహిస్తోంది. భీమునిపాదం జలపాతం ఉధృతంగా

(మిగతా 8లో..)

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్
8



డోర్నకల్ మండలం తాళ్ల సంకీస వద్ద రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద



గూడూరు మండలం గాజులగట్టులో వరద ఉధృతికి కొట్టుకుపోయిన మొక్కజొన్నలు

కొట్టుకుపోయిన మొక్కజొన్నలు

గూడూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : గూడూరు మండలం గాజులగట్టు గ్రామానికి చెందిన నాయిని అయిలయ్య తన సాగు చేయగా మొక్కజొన్నలను గూడూరు-నెక్కొండ రహదారిపై ఆరబెట్టుకున్నాడు. ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి సుమారు మూడు క్వింటాళ్ల మొక్కజొన్నలు కొట్టుకుపోయినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

జిల్లాలో 1035.0 మిల్లీమీటర్ల వర్షపాతం..

కురవి, మహబూబాబాద్‌లో అతిభారీ వర్షం కురిసింది. కురవిలో 132.4, మహబూబాబాద్‌లో 109.6, కొత్తగూడలో 91.2, గంగారంలో 88.4, బయ్యారంలో 72.4, గార్లలో 35.8, డోర్నకల్‌లో 43.6, గూడూరులో 89.0, కేసముద్రంలో 53.6, నెల్లికుదురులో 33.2, నర్సింహులపేటలో 57.4, చిన్నగూడూరులో 83.8, మరిపెడలో 52.4, దంతాలపల్లిలో 28.2, తొర్రూరులో 42.4, పెద్దవంగర 21.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 1035.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, సగటున 64.7 మిల్లీమీటర్ల వర్షం పడింది.

అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి):నీటి పారుదల శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... చివరి ఆయకట్టు వరకు సాగు నీరందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతున్నారని తెలిపారు. గతంలో నిర్మించిన కెనాల్‌లో ముళ్ల చెట్లు నిండిపోయి అందులో నుంచి నీరు వెళ్లకుండా ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. కెనాల్‌లో ముళ్ల చెట్లను, చెత్తను తొలగించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ అధికారులు రామకృష్ణ, వీరస్వామి, అప్పయ్య, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారులు వసతి గృహాలను తనిఖీ చేయాలి

- గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేకాధికారులు అన్ని వసతి గృహాలను తనిఖీ చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 46వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా ఉన్న సంక్షేమ వసతి గృహాల్లో మూడు రోజుల పాటు ప్రత్యేకాధికారులు తనిఖీలు చేపట్టాలని సూచించారు. పరిసరాలను పరిశీలించి పిల్లలతో కలిసి భోజనం చేసి హాస్టళ్లలో ప్రస్తుత పరిస్థితులను గమనించి నివేదికలను సమర్పించాలని



ఆదేశించారు. డైట్ మెనూ ప్రకారం రుచికరమైన, పౌష్టికాహారం అందించాలని, విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలని చెప్పారు. షెడ్యూల్ ప్రకారం నిర్వహించే ప్రతి కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని తెలిపారు. గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. శాఖల్లో ఏమైనా పెండింగ్‌లో ఉంటే తక్షణమే పరిష్కరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, కె.అనిల్‌కుమార్, జిల్లా అధికారులు మధుసూదనరాజు, వెంకటేశ్వర్లు, హరిప్రసాద్, డాక్టర్ కిరణ్‌కుమార్, దేశీనాంనాయక్, విజయనిర్మల, వేముల సురేష్, కృష్ణవేణి, నర్సింహామూర్తి, సబిత, శ్రీనివాసరావు, శ్రీహన్నారాయణరెడ్డి, యాదగిరి. పవన్‌కుమార్, రాఘవరెడ్డి, వినోద్ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలి



జ్యోతిబా పూలే పాఠశాలలో సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు

దంతాలపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జ్యోతిబా పూలే ఆశ్రమ పాఠశాలలో సోమవారం పీహెచ్‌సీ వైద్యుల ఆధ్వర్యంలో ఆరోగ్య రక్షణ అవగాహన సదస్సులో భాగంగా సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యురాలు కవిత మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతి పాఠశాలతో పాటు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధుల నుంచి రక్షించే చర్యలపై అవగాహన కల్పింస్తోందన్నారు. యువత పొగాకు, ఇతర చెడు అలవాట్లకు దూరంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీను, ఏఎన్ఎం కళావతి, హెచ్‌వీలు మంగమ్మ, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి



ఆస్పత్రి ఆవరణలో శ్రమదానాన్ని ప్రారంభిస్తున్న వైద్యాధికారులు

తొర్రూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలని తొర్రూరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్ రాజు అన్నారు. సోమవారం మహబూబాబాద్ ట్రైబల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కొనసాగుతున్న క్యాంపులో భాగంగా మూడవ రోజు తొర్రూరులోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో పేరుకుపోయిన వ్యర్థాలు, పిచ్చిమొక్కలను తొలగించి శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవా దృక్పథం, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ప్రత్యేక శిబిరాలు దోహద పడతాయన్నారు. చదువుతోపాటు సేవా భావం పెంపొందించేందుకు, సమాజంపై అవగాహన కల్పించేందుకు ఎన్ఎస్ఎస్ క్యాంపులు నిర్వహించడం అభినందనీయం అన్నారు. దేశ భవిష్యత్‌కు విద్యార్థులే మూలం అని, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ మునుకుంట్ల యాదలక్ష్మి, వైద్యాధికారి బి.నందనా దేవి, వైద్యులు మీరజ్, ప్రియాంక, శంకర్, మానస, అధ్యాపకులు చైతన్య, రజిని, వలంటీర్లు పూజ, లావణ్య, భవానీ, శ్రావ్య, మమత, జ్యోతి పాల్గొన్నారు.

తెగుళ్ల వ్యాప్తి పట్ల అప్రమత్తంగా ఉండాలి

నర్సింహులపేట(మహబూబాబాద్ క్రైం), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వరి పంటలో తెగుళ్ల వ్యాప్తి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండి సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి వినయ్‌కుమార్ అన్నారు. నర్సింహులపేట మండలంలోని కొమ్ములవంచ, రూప్లాతండా, జయపురం గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. వరి, మిర్చి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా తెగుళ్ల నివారణ కోసం రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈవో కల్యాణి, రైతులు వీరన్న, బాలు, లచ్చు తదితరులు పాల్గొన్నారు.

దంతాలపల్లిలో ట్రాఫికర్..

- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- రోడ్లపై భారీ వాహనాలు
- పట్టించుకోని అధికారులు



మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రోడ్డుపై నిలిచిన వాహనాలు

దంతాలపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారిపై గల దంతాలపల్లి మండల కేంద్రంలో రోజు రోజుకు భారీ ట్రాఫిక్ పెరుగుతోంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలకేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద రోడ్డుపైనే తోపుడు బండ్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు నిలుస్తుండడంతో ఇతరప్రాంతాలకు వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దంతాలపల్లి కేంద్రం సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం, వరంగల్, జనగామ జిల్లాలకు వెళ్లేందుకు కూడలి కావడంతో నిత్యం రద్దీగా ఆ ప్రాంతం కనబడుతోంది. పోలీసులు సైతం వాహనదారులకు పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినా ఫలితం లేకపోవడంతో ప్రయాణికులుఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు పార్కింగ్ కేంద్రాల్లోనే వాహనాలను ఆపేవిధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు, ప్రయాణికులు అధికారులను కోరుతున్నారు. రాత్రి వేళ్లలో వాహనాలను కొందరు రోడ్డుపై ఆపేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనాఅధికారులు రోడ్డుపై ఆగే వాహనదారులకు హెచ్చరికలు జారీ చేస్తూ ఇబ్బందుల నుంచి ఉపశమనం కలిగించాలని ప్రజలు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- వైద్యాధికారి గుగులోతు రవి



ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న వైద్యాధికారి

మరిపెడ రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక వైద్యాధికారి గుగులోతు రవి అన్నారు. మండలంలోని అబ్బాయిపాలెంలో గల ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైద్య బృందం సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. దోమల నివారణ, సీజనల్ వ్యాధులపై తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే సీజనల్ వ్యాధులు దరిచేరవవన్నారు. అదే విధంగా మురికి కాల్వల్లో నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మాధవి, తరణి, విజయ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ బకాయిలు విడుదల చేయాలి



తొర్రూరు మండలం వెల్లికట్టె శివారు పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

తొర్రూరు రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు చెల్లించాల్సిన స్కాలర్‌షిప్‌లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బెస్ట్ అవైలబుల్ పేరెంట్స్ డివిజన్ కమిటీ అధ్యక్షుడు మహంకాళి సాయిమల్లు డిమాండ్ చేశారు. సోమవారం తొర్రూరు మండలం వెల్లికట్టె గ్రామ శివారులోని అభ్యాస్ పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ పథకం కింద విద్యనభ్యసిస్తున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సంబంధించిన ఫీజులు చెల్లించక పోవడంతో పాఠశాల యాజమాన్యాలు ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆరోపించారు. ఇప్పటికైనా మొండివైఖరి వీడి బకాయిబిల్లులు చెల్లించాలని కోరారు. అనంతరం తొర్రూరు ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో గణేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్.మహేందర్, నగేష్, బందు యాకయ్య, సైదులు, హెచ్.రవి, యాకన్న, స్వాతి, మహేశ్వరి, యాకేశ్వరి, అరుణ, ఎస్ఎఫ్ఐ నాయకులు అమీర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బురదమయంగా కాలనీ రోడ్డు



మండలంలోని చీకటాయపాలెంలో సీసీరోడ్డుపై నిలిచి వర్షపు నీరు

తొర్రూరు రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తొర్రూరు మండలం చీకటాయపాలెం గ్రామంలోని ఎస్సీ కాలనీలో తేలికపాటి వర్షాలకు రోడ్లు బురదమయంగా మారుతున్నాయని కాలనీవాసులు సోమవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ 20సంవత్సరాల క్రితం సీసీరోడ్డు పోయడంతో ధ్వంసమైందన్నారు.కాలనీలో నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టాలని విన్నవించినా పట్టించుకోవడం లేదని, నీరు నిలిచి దోమలు స్వైర విహారం చేస్తున్నాయనిచెప్పారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. ఈ ఆందోళనలో దీపిక, సవీణ, అరుణ,బూర్గులఅరుణ, యాకన్న, లచ్చి నర్సు, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ క్లబ్‌గా తొర్రూరు లయన్స్ క్లబ్



పురస్కారం అందుకుంటున్న తొర్రూరు లయన్స్ క్లబ్ సభ్యులు

తొర్రూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాల నిర్వహణలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 77 క్లబ్‌లలో ఉత్తమ పనితీరు తొర్రూరు లయన్స్ క్లబ్ కనబర్చిందని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సూర్ణం రాంనర్సయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ హనుమకొండ లయన్స్ క్లబ్ త్రైమాసిక పురస్కారాల కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిన తొర్రూరు లయన్స్ క్లబ్ ఫస్ట్ బెస్ట్ టాప్ పర్ఫార్మెన్స్ పురస్కారం అందుకుందన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సూర్ణం రాంనర్సయ్య ఆధ్వర్యంలో మూడు మాసాల్లో 300 పైచిలుకు సేవలు అందించినందుకు గాను తొర్రూరు లయన్స్ క్లబ్‌కు ఈ పురస్కారం దక్కిందని పేర్కొన్నారు. ఎల్సీఐఎఫ్ ఏరియా ప్రతినిధి దీపక్ భట్టాచార్య, జిల్లా గవర్నర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య, ఉపగవర్నర్‌లు సదాకర్‌రెడ్డి, హరికిషన్‌రెడ్డిల సమక్షంలో ఈ పురస్కారాన్ని అందుకున్నట్లు తెలిపారు. సేవకు ప్రతిరూపం లయన్స్ క్లబ్ అని, అవసరార్థులకు సేవలు అందించడంలో క్లబ్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కుందూరు రాజేందర్‌రెడ్డి, తమ్మెర లక్ష్మీనర్సింహరావు, డాక్టర్ కిరణ్‌కుమార్, రేగూరి వెంకన్న, శారద, దామెర సరేష్, చిదిరాల నవీన్, వేణుగోపాల్, ముడుపు రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, రమేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక



భద్రినారాయణ, కిషన్‌నాయక్, రవీందర్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్(రెవా) జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం సంఘ సభ్యులంతా సమావేశమై జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సంకా భద్రినారాయణ, ప్రధాన కార్యదర్శిగా గుగులోతు కిషన్‌నాయక్, గౌరవ అధ్యక్షుడిగా సోమ గోవర్ధన్, ఉపాధ్యక్షులుగా ఆర్‌వీ.చలం, కె.యోగేశ్వర్‌రావు, అంబటి రవీందర్, తులసి పద్మావతి, కార్యదర్శులుగా ఎస్.వెంకటేశ్వర్లు, టి.మురళీధరస్వామి, పి.ఏ.రత్నం, డి.పద్మం, కోశాధికారిగా గుదె చంద్రమౌళి, సభ్యులుగా సంజీవరెడ్డి, బి.గోవర్ధన్, పి.వెంకన్న, ఆర్.నిరంజన్‌రెడ్డి, ఎం.రవీందర్, వి.లక్ష్మిలను ఎన్నుకున్నారు.

మార్కెట్‌కు పోటెత్తిన మక్కలు

- రోజుకు 5వేలకు పైగా బస్తాల రాక
- సగటు ధర రూ.2040 నుంచి రూ.2120 మధ్యనే



కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు వచ్చిన మక్కజొన్నలు

కేసముద్రం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు మొక్కజొన్న రాబడులు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. ఈ మార్కెట్‌కు సోమవారం 119 మంది రైతులు 5628 బస్తాల్లో 3377 క్వింటాళ్ల మొక్కజొన్నలు విక్రయానికి తీసుకువచ్చారు. ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్(ఈ-నామ్) విధానంలోని 'ఈ-వేలం'లో మొక్కజొన్న క్వింటాకు గరిష్ఠంగా రూ.2171, కనిష్ఠ ధర రూ.1879, సగటున రూ.2146 ధరలతో వ్యాపారులు ఖరీదులు చేశారు. గత నెల రోజులుగా ఈ మార్కెట్లో మొక్కజొన్న క్వింటాల్‌కు సగటున రూ.1960 నుంచి రూ.2090ధరలు ఉండగా వారం రోజులుగా సగటు ధర కొంతపెరిగి రూ.2040 నుంచి రూ.2120 మధ్యన కొనసాగుతున్నాయి. 14 శాతం కంటే తక్కువ తేమతో నాణ్యమైన మొక్కజొన్నలకు సైతం రూ.2,100 నుంచి రూ.2,150 వరకే ధర వస్తోంది. మొక్కజొన్నకు ప్రభుత్వ కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) క్వింటాకు రూ.2400గా ఉండగా నాణ్యత ఉన్న సరుకుకు కూడా అంతకంటే తక్కువ ధరలకే కొనుగోలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా మార్కెట్‌కు మొక్కజొన్న రాబడులు క్రమంగా పెరుగుతున్నాయి. గతనెల చివరి వారం వరకు 500 బస్తాల వరకే రాబడులు ఉండగా ఈనెల మొదటి వారంలో 3800 బస్తాల వరకు మొక్కజొన్నలు విక్రయానికి రైతులు తీసుకువచ్చారు. రెండోవారంలో క్రమంగా పెరుగుతూ గత శుక్రవారం నుంచి 5వేల బస్తాలకుపైగా మొక్కజొన్నలు వస్తున్నాయి. మార్కెట్‌లోని కవర్ షెడ్లు అన్నీ మొక్కజొన్న రాశులతో నిండిపోతున్నాయి. కొంతమంది రైతులు మొక్కజొన్నలను ఆరబెట్టుకునేందుకు కల్లాలు అందుబాటులోలేక మార్కెట్ ఓపెన్‌యార్డులో, ఖాళీగా ఉన్న షెడ్లలో ఆరబోసుకుంటున్నారు. ప్రస్తుతం అకాల వర్షాలతో ఆరబెట్టుకుంటున్న రైతుల మక్కలు తడిసిపోతున్నాయి. ఏదేమైనా కొద్దిరోజులుగా అరకొర సరుకులతో వెలవెలబోయిన యార్డు తాజాగా పెరుగుతున్న మొక్కజొన్నల రాబడులతో మార్కెట్ కొంత కళకళలాడుతోంది.

హత్యా.. ఆత్మహత్యా..?

- మిస్టరీగా మారిన అంగన్‌వాడి టీచర్ మృతి
- దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు

మహబూబాబాద్ క్రైం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బెస్త బజారులో నివాసం ఉంటున్న అంగన్‌వాడి టీచర్ మృతి పట్టణంలో సంచలనం రేకెత్తించింది. హత్యా.. ఆత్మహత్యా అనే విషయం మిస్టరీగా మారింది. మృతురాలు బానోతు మాధవి భర్త కృపాకర్ ఎనిమిదేళ్ల క్రితమే అనారోగ్యంతో మృతి చెందారు. ఒక్కగానొక్క కూతురు షారోనిదీప్తితో బెస్త బజారులో నివాసం ఉంటూ కృష్ణకాలనీలోని అంగన్‌వాడీ సెంటర్‌లో టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మృతురాలు మాధవి, కూతురు షారోని దీప్తితో కలిసి ప్రతి ఆదివారం స్థానిక చర్చిలో ప్రార్థనకు వెళ్లేవారు. కానీ ఈ వారం కూతురు మాత్రమే చర్చికి వెళ్లింది. ఇంట్లో ఒక్కతే ఉన్న మాధవిపై గుర్తు తెలియని వ్యక్తులు అఘాయిత్యానికి పాల్పడి హత్య చేసి ఇంట్లో ఉరి వేసుకున్నట్లు చిత్రీకరించినట్లు మృతురాలు శరీరంపై ఉన్న గాయాల ప్రకారం తెలుస్తోంది. ఎవరు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఎందుకు చేశారు..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. త్వరలో పోలీసుల విచారణలో నిజానిజాలు వెలుగులోకి రానున్నాయి.

అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ ఆందోళన..



ఎమ్మెల్యే మురళీనాయక్‌కు వివరిస్తున్న ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ కృష్ణకాలనీ కట్టెలమండె అంగన్‌వాడీ టీచర్ బానోత్ మాధవి అనుమానస్పద మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.అజయ్ సారథిరెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్‌ల నేతలు ఎల్లారీశ్వరీ, స్నేహబిందు, సులోచన డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శవపరీక్ష కేంద్రం వద్ద ఏఐటీయూసీ, సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్‌ల ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనుమానస్పద స్థితిలో ఉరి వేసుకుని చనిపోయిన అంగన్ వాడీ టీచర్ మాధవి మృతి పట్ల విచారణ జరిపించి నిజాలను వెలికి తీయాలని కోరారు. మాధవి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని, అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్ మాధవి మృతదేహాన్ని సందర్శించేందుకు వచ్చిన ఎమ్మెల్యే మురళీనాయక్‌కు ఆయా సంఘాల నేతలు సమస్యను వివరించారు. మాధవి మృతిపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని స్థానిక ఎమ్మెల్యే మురళీనాయక్ అటు పోలీసులను, ఇటు వైద్యులను ఆదేశించారు. అనంతరం మాజీ ఎంపీ కవిత అక్కడకు చేరుకుని అంగన్‌వాడీ టీచర్ మాధవి మృతదేహా న్ని సందర్శించి ఆమె మృతిపై అన్ని కోణాల్లో విచారించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, వెలుగు శ్రావణ్, సౌమ్యశ్రీ, పద్మ, మహమూదా, వరలక్ష్మి. అండాలు, సుజాత, కనకలక్ష్మి, సరోజ, రోజా, సుభాషిని, మల్లికాంబ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ (మత్తు పదార్థాల) రహిత సమాజానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం డ్రగ్స్ నిర్మూలనపై అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని చెప్పారు. యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఉండేందుకు వారికి ముందస్తు అవగాహన సదస్సులు నిర్వహించి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణ కోసం కృషి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ , బీసీ, మైనార్టీ, అంగన్‌వాడీ కేంద్రాలు , తదితర సంక్షేమ వసతి గృహాల్లో ప్రార్థన సమయాల్లో డ్రగ్స్ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించాలన్నారు. జిల్లాలోని రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు, ప్రజలు సంచరించే ప్రదేశాల్లో ప్రత్యేక నిఘా పెట్టి గమనిస్తూ ఉండాలన్నారు. మునిసిపల్, గ్రామ పంచాయతీ పరిధుల్లో గుడుంబా తయారీ, రవాణ, వినియోగంపై నిఘా పెంచి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు గుడుంబా, డ్రగ్స్ ఎన్డీపీఎల్ తదితర పదార్థాలను సరఫరా చేసిన వారిని గుర్తించి 1430 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేసి గుడుంబా, డ్రగ్స్, మాదక ద్రవ్యాల నిర్మూల నకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, ఆర్డీవోలు గణేష్, కృష్ణవేణి పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రాణసంకటం

- గుంతలతో ఇబ్బందులు పడుతున్న జనం







బయ్యారం మండలం గంధంపల్లి, కొత్తపేట శివారులో గుంతలమయంగా మారిన రోడ్డు

బయ్యారం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల విస్తారంగా కురిసిన వర్షాలతో రహదారులన్ని గుంతలమయంగా మారాయి.. రోడ్డు విస్తీర్ణమంతా ఎక్కడ పడితే అక్కడ గుంతలు ఏర్పడటంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.. అడుగు అడుగుకు ఏదో ఒక గుంత అడ్డంకిగా మారడంతో వాహనదారులకు నరకప్రాయంగా మారింది.. మహబూబాబాద్- ఇల్లెందు ప్రధాన రహదారి మార్గమధ్యంలోని బయ్యారం, గంధంపల్లి, కొత్తపేట, నామాలపాడు ప్రాంతాలలో రహదారి తీవ్రంగా దెబ్బతిన్నది. దీంతో ప్రయాణికులకు కొంత కాలంగా ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. గుంతల మూలంగా వాహనాలు దెబ్బతింటున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి దెబ్బతిన్న రహదారికి మరమత్తులు చేపట్టాలని ప్రయాణికులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


వలంటీర్లకు అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ పాండురంగారావు


రామప్ప దేవాలయం ఆవరణలో వలంటీర్లతో ప్రొఫెసర్లు, కళాకారులు

కాకతీయుల ఖ్యాతి విశ్వవ్యాప్తం

రామప్ప ఆలయంలో హెరిటేజ్ క్యాంపు

- శిక్షణకు 12 రాష్ట్రాల నుంచి 38 మంది వలంటీర్ల రాక
- ఈ నెల 17 వరకు కొనసాగనున్న శిబిరం
- ఆలయ విశిష్టతను కొనియాడిన శిక్షణార్థులు


వలంటీర్లకు శివతాండవం గురించి వివరిస్తున్న పేరిణి నృత్య కళాకారుడు

వెంకటాపూర్, అక్టోబరు 13, (ఆంధ్రజ్యోతి): యునెస్కో గుర్తింపు పొందిన చారిత్రక రామప్ప ఆలయ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో మరింత చాటి చెప్పాలని కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సంకల్పించింది. ఇందులో భాగంగా దేశ విదేశాల వలంటీర్లకు అవగాహన కల్పించేందుకు శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా, ఇంటాక్ ఐకోమస్, తెలంగాణ టూరిజం, ఎస్ఆర్ఐ సీటీ సంస్థలతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈనెల 8న క్యాంపు ప్రారంభం కాగా 17వ తేదీ వరకు కొనసాగనుంది. రామప్ప ఆలయ వాస్తుశిల్పం, నిర్మాణ సాంకేతికత, వారసత్వ నిర్వహణ, జియో ఇంజనీరింగ్ అంశాలపై వలంటీర్లకు శిక్షణ ఇస్తున్నారు. కాకతీయుల పరిపాలన, పట్టణ ప్రణాళిక, రుద్రేశ్వరాలయ ఔన్నత్యం, ట్యాంక్, టౌన్, టెంపుల్ (టీటీటీ) అంశాలను వక్తల ప్రసంగాల తెలుసుకున్నారు. రేచర్ల రుద్రయ్య 1213లో కాకతీయుల కాలంలో నిర్మించిన శైవ దేవాలయాల్లో రామప్ప ఒకటి. ఈ అద్భుతమైన ఆలయ చరిత్ర తెలుసుకోవడం కోసం కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ చేపట్టిన ఈ శిక్షణలో ప్రపంచ నలుమూలల నుంచి 38 మంది వలంటీర్లు పాల్గొంటున్నారు. వీరిలో ముగ్గురు ఇరాన్ దేశానికి చెందిన వారు ఉండటం విశేషం. శిక్షణలో పాల్గొంటున్న వలంటీర్లను పలకరించినప్పుడు తమ అభిప్రాయాలను తెలియజేశారు.


వలంటీర్లకు యోగాసనాలు చేయిస్తున్న యోగా గురువు రాంబాబు

రామప్ప ఆర్కిటెక్ట్ అద్భుతం


- అలీ మొరాజీగంజ్, ఇరాన్

రామప్ప ఆర్కిటెక్ట్ అద్భుతం. వేయిస్తంభాల గుడి, కల్యాణ మండపం అలనాటి కళా నైపుణ్యానికి నిలువెత్తు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. వేల సంవత్సరాల నాటి పాండవులగుట్టలోని సహజసిద్ధమైన శిలాతోరణాలు, వివిధ కట్టడాలు కళాకారుల ప్రతిభకు సజీవసాక్ష్యాలు. ఈ శిబిరంతో భారతదేశంలోని కళా నైపుణ్యం తెలుసుకునే అవకాశం రావడం సంతోషంగా ఉంది. భారతదేశ సంస్కృతి చాలా బాగుంది.

ప్రతాపరుద్రుడి చరిత్రను తెలుసుకున్నా


- రప్పాల్‌సింగ్, పంజాబ్

809 సంవత్సరాల క్రితం కాకతీయులు ఏలిన ప్రతాపరుద్రుడి చరిత్రను రామప్ప దేవాలయంలో ఏర్పాటు చేసిన శిలాశాసనంపై చూశాను. లిపి ద్వారా తెలుసుకోవడం ఆనందంగా ఉంది. హెరిటేజ్ క్యాంపునకు రావడం వల్ల రామప్ప చరిత్రతోపాటు ములుగు జిల్లాలో ఉన్న అనేక కాకతీయ కట్టడాల గురించి తెలుసుకున్నాను. ఆర్ట్, ఆర్కిటెక్చర్‌పై అమితమైన ఆసక్తి పెరిగింది.

మదనిక శిల్పాలు అద్భుతం


- ప్రజ్ఞ, ఢిల్లీ

రామప్ప ఆలయం ముందుభాగంలో ఉన్న 12 మదనికలు మమల్ని మంత్రముగ్ధుల్ని చేశాయి. శివలింగానికి ముందుభాగంలో ఉన్న నందీశ్వర విగ్రహాన్ని డోలరైట్ స్టోన్‌తో చెక్కడం గొప్ప కళా నైపుణ్యం. ఆలాగే క్యాంపు ద్వారా అనేక విషయాలతోపాటు రామప్ప సరస్సు ప్రాంతం, రామప్ప సరస్సును నిర్మించిన వారి చరిత్ర కూడా ఈక్యాంపు ద్వారా తెలుసుకున్నాం.

మరిన్ని సౌకర్యాలు కల్పించాలి


- కాశికభట్, డెహ్రాడూన్

ప్రపంచ వారసత్వ కట్టడమైన రామప్ప దేవాలయానికి మరిన్ని సౌకర్యాలు కల్పించాలి. రవాణా సౌకర్యంతోపాటు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించాలి. రామప్ప రమణీయతను నేను మా ప్రాంతంలో తెలియజేస్తాను. మరోసారి కూడా రామప్ప క్యాంపునకు వస్తాను. అంతర్జాతీయ పర్యాటకులు వచ్చే సంఖ్యను క్రమంగా పెంచేలా చేయాలి.

కాకతీయుల ఖ్యాతిని మరింత విస్తరిస్తాం


కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ద్వారా గత నాలుగు సంవత్సరాల నుంచి దేశ విదేశాలకు చెందిన వలంటీర్లకు ఉచిత శిక్షణ అందిస్తున్నాం. కాకతీయుల ఖ్యాతిని మరింత విశ్వవ్యాప్తం చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నాం. వలంటీర్లకు చరిత్ర, ఆర్కియాలజీ, హెరిటేజ్, ఆర్కిటెక్చర్, సివిల్ ఇంజనీరింగ్, టూరిజం తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నాం. సుమారు 20మంది ప్రొఫెసర్లు వారికి శిక్షణ ఇస్తున్నారు. రాబోయే రోజుల్లో కూడా మరిన్ని శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తాం. రామప్ప ఖ్యాతిని మరింత పెంచుతాం.

- బియ్యాల పాపారావు, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ సభ్యుడు, రిటైర్డు ఐఏఎస్ అధికారి

ఇలాంటి శిక్షణలు ఎంతో అవసరం


రామప్ప సర్వతోముఖాభివృద్ధికి ఇలాంటి శిక్షణలు దోహదపడుతాయి. కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ద్వారా అనేకమంది వలంటీర్లకు శిక్షణ అందిస్తున్నాం. కాతీయుల కట్టడాలు, చరిత్రను భావితరాలకు అందించేందుకు మా ట్రస్ట్ ముందుంటుంది.

- జనగాం శ్రీధర్‌రావు, కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యుడు, శిక్షణ కోఆర్డినేటర్

వినూత్న ఆవిష్కరణలకు పునాది


కొత్త ఆలోచనలు, వినూత్న పరిశోధనలు హెరిటేజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణ వలంటీర్లకు పునాది వేస్తుంది. పరిశోధక విద్యార్థులకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. రామప్పలో ఇలాంటి క్యాంపులు ఏర్పాటు చేయడం ఇది నాలుగో సారి. ప్రస్తుతం ఈ క్యాంపునకు ఇరాన్‌కు చెందిన ముగ్గురు వలంటీర్లు రావడం వారికి మంచి అవకాశం. వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం.

- సూర్యకిరణ్, టూరిజం ప్రమోటర్


పరిశీలనకు వచ్చిన ఢిల్లీ అధికారి హసన్‌తో ఐనవోలు పోలీసులు

జాతీయ స్థాయిలో టాప్-10 కోసం పోటీ

- ఐనవోలు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎంహెచ్‌ఏ ఎవాల్యూయేషన్ అధికారి
- ఉత్తమ ప్రమాణాల కోసం కసరత్తు

ఐనవోలు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఉత్తమ పోలీస్‌స్టేషన్ల ఎంపికలో ఐనవోలు పోలీస్‌స్టేషన్‌ను కేంద్ర హోం మంత్రిత్వశాఖ (మినిస్ట్రీ ఆఫ్ హోం అఫైర్స్) ఎవాల్యూయేషన్ అధికారి సయ్యద్ మహ్మద్ హసన్ సోమవారం సందర్శించారు. ఏటా జాతీయస్థాయిలో చేపట్టే ఉత్తమ పోలీస్‌స్టేషన్ల ఎంపిక పోటీలో ఐనవోలు పోలీస్‌స్టేషన్ 2024-25 సంవత్సరానికి ఆన్‌లైన్ రికార్డుల నమోదులో ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఇలా జాతీయస్థాయిలో మొత్తం 78 పోలీస్‌స్టేషన్లను ఎంపికచేయగా దేశంలో తెలంగాణ 3వ స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో మూడు పోలీస్‌స్టేషన్లు ఎంపిక కాగా అందులో ఐనవోలు ఒకటి. ఈ 78 పోలీస్‌స్టేషన్లలో ఐనవోలు పీఎస్‌ను టాప్-10లోకి ఆ శాఖ సూచించిన ప్రమాణాలకు తగ్గట్టుగా తీసుకురావడం కోసం ఎస్సై పస్తం శ్రీనివాస్ ఉన్నతాధికారుల సూచనల మేరకు కృషి చేశారు. ఢిల్లీ నుంచి వచ్చిన అధికారి హసన్ పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఇందులో ఉత్తమ పోలీస్‌స్టేషన్ పోటీలో మంచి ర్యాంకింగ్ కోసం ఆ శాఖ సూచించిన 19 అంశాలను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు.

రెండు సంవత్సరాల రికార్డును పరిశీలించాం..

ఢిల్లీ అధికారి మహ్మద్ హసన్ విలేకరులతో మాట్లాడుతూ డిపార్ట్‌మెంట్ నిబంధనల మేరకు 2 సంవత్సరాల రికార్డులను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా గుర్తించిన 78పోలీస్‌స్టేషన్లలో రాష్ట్రం నుంచి ఐనవోలు, శామీర్‌పేట్, పలిమెల పోలీస్ స్టేషన్లు ఉన్నట్లు వెల్లడించారు. నవంబర్ లేదా డిసెంబర్‌లో టాప్- 10 పోలీస్‌స్టేషన్లను హోం శాఖ ప్రకటించనున్నట్లు తెలిపారు. టాప్-10లో చోటు వస్తే పోలీస్‌స్టేషన్‌కు మోడల్ స్టేషన్‌గా ప్రశంసాపత్రం అందుతుందన్నారు. టాప్-3 వస్తేఎస్‌హెచ్‌వోకు అవార్డు అందించనున్నారు. ఐనవోలు పోలీస్‌స్టేషన్ పనితీరు సంతృప్తికరంగా ఉందని తెలిపారు. ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, మామునూరు ఏసీపీ వెంకటేష్, పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఎస్సై పస్తంశ్రీనివాస్ పాల్గొన్నారు. ర్యాంకింగ్ కోసం కృషి చేసిన స్థానిక ఎస్సై పస్తం శ్రీనివాస్, సీఐ రాజగోపాల్, సిబ్బందిని డీసీపీ, ఏసీపీ అభినందించారు.

చేతులు కలిసేదెప్పుడో!?

- చిచ్చు రేపుతున్న మేడారం మహాజాతర అభివృద్ధి పనులు
- టెండర్ల విషయంలో మంత్రులు కొండా, పొంగులేటి మధ్య విభేదాలు

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

మేడారం మహజాతరను ప్రభుత్వం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. వచ్చే జనవరి 28నుంచి 31వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు మహజాతర జరగనుంది. ఇందుకోసం ప్రభుత్వం రూ.150కోట్ల నిధులను కేటాయించింది. వీటితో పాటు తల్లుల గద్దెలను గ్రానైట్‌తో ఆధునీకరించటంతో పాటు ఒకే వరుసలో ఉండేలా డిజైన్ రూపొందించారు. అంతేకాకుండా గద్దెల సాలారాన్ని కూడా ఎటూ 20ఫీట్ల వరకు విస్తరించేందుకు ప్రణాళిక రూపొందించారు. గత నెల 23న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా మేడారం సమ్మక్క, సారలమ్మలను దర్శించుకున్నారు. మహజాతర గద్దెల విస్తరణ, ఆధునీకరణపై ఆదివాసీలు, పూజారుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. వంద రోజుల్లో ఆధునీకరణ పనులు పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చారు.

సీఎం రేవంత్‌రెడ్డి మేడారం మహజాతరను వైభవంగా నిర్వహించేందుకు ఎంతో ఉత్సాహంగా ఉండగా స్థానికంగా రాజకీయాలు చికాకు తెప్పిస్తున్నాయనే చర్చ జరుగుతుంది. ప్రధానంగా దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ప్రాధాన్యత తగ్గిస్తున్నారని ఆమె వర్గీయులు ఆరోపిస్తున్నారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో సమ్మక్క, సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజుల గద్దెలను ఆధునీకరించేందుకు నిధులు మంజూరు చేశారు. సుమారు రూ.71కోట్లతో చేపట్టే ఈ పనులను ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీ, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తన సొంత కంపెనీకి తనకు తెలియకుండా టెండర్లు ఇప్పించుకున్నారని మంత్రి కొండా సురేఖ అగ్రహంతో ఉన్నట్లుగా ప్రచారం జరిగింది. సోషల్ మీడియాలో పొంగులేటిపై సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌తో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్‌గాంధీ, సోనియాగాంధీలకు కొండా దంపతులు ఫిర్యాదు చేశారని ప్రచారం జరిగింది. అయితే తాము ఎవరికీ ఫిర్యాదు చేయలేదని కొండా దంపతులు చెప్తున్నప్పటికీ తన శాఖపై ఇంకొక మంత్రి పెత్తనం ఏమిటని కొండా గుర్రుగా ఉన్నట్లు రాజకీయవర్గాల్లో టాక్ వినబడుతుంది. ఇదే సమస్యపై మంత్రి సీతక్క కూడా తనకు ఫిర్యాదు చేసిందని, ఇది తమ పార్టీ అంతర్గత విషయమని, సీఎంతో మాట్లాడి సమస్యను పరిష్కరించుకుంటామని స్వయంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ ప్రకటించారు. అయితే తాను ఎవరిపై ఫిర్యాదు చేయలేదని, మేడారం ప్రతిష్ట దెబ్బతినకుండా ఇద్దరు మంత్రుల మధ్య నెలకొన్న సమస్యను పరిష్కరించాలని మాత్రమే మహేష్‌గౌడ్‌ను కోరినట్లుగా సీతక్క ఆ తరువాత వివరణ విడుదల చేశారు.

2024 మేడారం జాతర సమయంలోనూ కొండా సురేఖ, సీతక్క మధ్య విభేదాలు ఉన్నట్లుగా ప్రచారం జరిగింది. దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ లేకుండానే మేడారం జాతర సమీక్షలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి 2024 ఫిబ్రవరి 23వ తేదీన మేడారం జాతరకు వస్తే.. అదే రోజు సీఎంతో కలిసి సురేఖ హజరయ్యారు. ఆరోగ్య సమస్యల వల్లే కొంత దూరంగా ఉన్నానని అప్పట్లో మంత్రి చెప్పినప్పటికీ మంత్రుల మధ్య విభేదాలే కారణమనే ప్రచారం జరిగింది. ప్రస్తుతం కూడా మళ్లీ మంత్రుల మధ్య విభేదాలు తెరపైకి వస్తుండటం చర్చనీయాంశంగా మారింది.

సురేఖకు ఆహ్వానం లేదా..?

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి దనసరి అనసూయ సోమవారం మేడారంలో పర్యటించారు. సమ్మక్క, సారలమ్మ తల్లులకు మొక్కులు చెల్లించి జాతరలో చేపట్టే పనులను పరిశీలించి, అధికారులతో సమీక్షించారు. అయితే కీలకమైన ఈ పర్యటనలో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ కనిపించకపోవటం చర్చనీయాంశంగా మారింది. దేవాదాయశాఖ మంత్రిగా, ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రిగా కొండా సురేఖ మేడారం పర్యటనలో పాల్గొనాల్సి ఉండగా, ఆహ్వానం అందకపోవటంతోనే మేడారం పర్యటనకు దూరంగా ఉన్నారనే చర్చ జరుగుతుంది.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయంలో నాలుగు సార్లు మేడారం మహజాతరను నిర్వహించారు. ఏ కీలక శాఖ మంత్రి పర్యటనకు వచ్చినా.. జాతర పనులపై సమీక్ష నిర్వహించినా సంబంధిత శాఖ మంత్రితో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హజరయ్యేవారని భక్తులు చర్చించుకుంటున్నారు. దేవాదాయశాఖ, గిరిజన శాఖ మంత్రులు సమీక్షలో పాల్గొనేవారనే టాక్ ఉంది. కోట్లాది మంది భక్తులు వచ్చే మేడారం మహజాతర పనుల సమీక్షకు మంత్రి సురేఖను ఆహ్వానించకపోవటం పట్ల కొండా వర్గీయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమీష్టిగా మేడారం మహజాతర సమీక్షలో పాల్గొంటేనే పారదర్శకంగా పనులు జరుగుతాయని, ఏమైనా పొరపాట్లు ఉన్నా సీఎం దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంటుందని కాంగ్రెస్ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి.

విభేదాలకు ఫుల్‌స్టాప్ ఎప్పుడో..?

ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య విభేదాలకు ఎప్పుడు ఫుల్‌స్టాప్ పడుతుందనే చర్చ కాంగ్రెస్ శ్రేణుల్లో జోరుగా జరుగుతుంది. పదేళ్ల తరువాత అధికారంలోకి వస్తే.. గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపీలు ఒకే వేదికపైకి వచ్చి.. ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై ప్రణాళిక రూపొందించుకున్న దాఖాలాలు లేవనే చర్చ జరుగుతుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటిరీ ఏదో రకంగా మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య విభేదాలు రచ్చకెక్కుతుండటం క్యాడర్‌కు చిరాకు కలిగిస్తున్నాయనే టాక్ వినబడుతుంది. మేడారం జాతర విషయంలో ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులతో పాటు ఇన్‌చార్జి మంత్రి సమన్వయంగా పని చేస్తేనే భక్తులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటుదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. గత జాతరలో భక్తులు తాగునీటికి, మరుగుదొడ్లకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తల్లుల దర్శనానికి కూడా గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వచ్చింది. గత జాతరకు కేటాయించిన నిధుల్లో సుమారు రూ.20కోట్ల పనులు కూడా అప్పట్లో పూర్తి చేయలేకపోయారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య విభేదాలను పక్కన పెట్టి జాతర సక్సెస్‌పై దృష్టి పెట్టాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రూ.15 లక్షలతో కటాక్షపూర్ కాజ్‌వే నిర్మాణం

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- కటాక్షపూర్ కాజ్‌వే నిర్మాణంపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : వరంగల్-ములుగు ప్రధాన రహదారిలో ఉన్న కటాక్షపూర్ కాజ్ వే నిర్మాణ పనులను రూ.15 లక్షలతో చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం కటాక్షపూర్ కాజ్ వే నిర్మాణానికి సంబంధించి సాగునీటి పారుదల, జాతీయ రహదారుల శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కటాక్షపూర్ చెరువులోకి వరదనీరు ఎక్కడి నుండి వస్తుందని, కాజ్ వే నిర్మాణం చేపట్టడానికి నీటి ప్రవాహాన్ని ఆపేందుకు ఉన్న అవకాశాలు, తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. కటాక్షపూర్ చెరువులోకి ఎగువ ప్రాంతంలో ఉన్న మల్లంపల్లి వైపు నుంచి నీరు వచ్చి చేరుతుందని దీంతో చెరువులో నీరు ఎక్కువగా ఉండి కిందకు ప్రవహిస్తుందని సాగునీటి పారుదల శాఖ అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. కటాక్షపూర్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రతీరోజు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. పై నుంచి వరద వస్తున్న కారణంగా రహదారి దెబ్బతింటుందని తెలిపారు. కాజ్ వే నిర్మాణానికి ఎన్ని రోజుల సమయం పడుతుందని ఇరు శాఖల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ కటాక్షపూర్ వద్ద ప్రధాన రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు తప్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి ప్రవాహాన్ని మళ్లించడం ద్వారానే కాజ్ వే నిర్మాణ పనులు సాధ్యమవుతాయన్నారు. కాజ్ వే నిర్మాణం కోసం కటాక్షపూర్ చెరువు పై నుండి వస్తున్న నీటి ప్రవాహాన్ని ఎలా కట్టడి చేయవచ్చో సాగునీటి పారుదల శాఖ అధికారులు సమగ్ర వివరాలను అందజేయాలన్నారు. వీలైనంత త్వరగా కాజ్ వే నిర్మాణ పనులు పూర్తిచేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీవో మేన శ్రీను, జాతీయ రహదారుల శాఖ అధికారులు, నీటిపారుదల శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్

● భీమునిపాదం హోరు


వర్షాలతో మహబూబాబాద్ జిల్లా గూడూరు మండ లం సీతానగరం శివారు కొమ్ములవంచ అటవీప్రాంతంలో ఉన్న భీమునిపాదం జలపాతానికి వరద ఉధృతి పెరిగింది. దీంతో ఎత్తయిన గుట్టపై నుంచి జలపాతం దూకుతూ పర్యాటకులను ఆకట్టుకుంటోంది. పర్యాటకుల రాక పెరిగే అవకాశం ఉండటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గూడూరు అటవీశాఖ రేంజ్ అధికారి బి.సురేష్ సిబ్బందిని ఏర్పాటు చేశారు.

- ఆంధ్రజ్యోతి, గూడూరు

కేసముద్రం లయన్స్‌క్లబ్‌కు 'సేవా ప్రతిభ అవార్డు'



అవార్డును అందుకుంటున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మామిడి అశోక్

కేసముద్రం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం లయన్స్‌క్లబ్‌కు 'సేవా ప్రతిభ అవార్డు' దక్కింది. వరంగల్ నాని గార్డెన్స్‌లో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన క్లబ్ 320 ఎఫ్ డిస్ట్రిక్ట్ మొదటి త్రైమాసిక అవార్డుల ప్రధానోత్సవంలో ఈ మేరకు క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.చంద్రశేఖర్ ఆర్య చేతుల మీదుగా క్లబ్ అధ్యక్షుడు మామిడి అశోక్ ఈ అవార్డును అందుకున్నారు. వీడీజీ వెంకట్ రెడ్డి, ఎఫ్‌వీపీడీజీ సుధాకర్ రెడ్డి, హరికిషన్ రెడ్డి, ఆర్‌సీ దామెర నరేష్‌కు మార్, పాస్ట్ జడ్‌సీలు యర్నం శ్రీరాములు, ఊకంటి యాకూబ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికతో మేడారం పనులు

● పటిష్ఠంగా మాస్టర్‌ప్లాన్ అమలు ● 90 రోజుల్లో పూర్తి చేస్తాం ● మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క ● అధికారులతో సమీక్ష సమావేశం

తాడ్వాయి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క- సారలమ్మల దేవస్థానం మాస్టర్ ప్లాన్ అభివృద్ధి పనులను 90రోజుల్లో పూర్తి చేస్తామని రెవన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని వనదేవతల సన్నిధి మేడారంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, ములుగు కలెక్టర్ దివాకర, పూజారులతో కలిసి మంత్రి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. అనంతరం అధికారులతో సమావేశమై మేడారం మాస్టర్ ప్లాన్‌పై సమీక్షించారు. వనదేవతలను దర్శించుకున్న అనంతరం హరిత హోటల్‌లో విలేకరులతో మంత్రులు మాట్లాడారు. 2026 జనవరి 28 నుంచి 31 వరకు జరగబోమే వనదేవతల మహా జాతర లోగా పనులు పూర్తి చేసేలా పక్కా ప్రణాళికలు రూపొందించామన్నారు. గిరిజనులకు, గిరిజనేతరులకు ఆరాధ్య దైవాలైన సమ్మక్క- సారలమ్మల దేవస్థానం అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. పనులను ఇప్పటికే ప్రారంభమయ్యాయని, ఇతర రాష్ట్రాల్లో రాతి శిల్పాలు కటింగ్ వర్క్స్ జరుగుతున్నాయని అన్నారు. పనుల్లో వేగం పెంచి మహా జాతరకు ముందుగా పూర్తి చేస్తామని అన్నారు.



గద్దెల వద్ద గంట కొడుతున్న మంత్రులు, ఎంపీ

మహా జాతరకు ప్రభుత్వం రూ. 150 కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే అన్నారు. అంతేకాకుండా దేవస్థానం అభివృద్ధికి ప్రత్యేకంగా రూ. 101కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఇందులో రూ. 51కోట్ల పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని తెలిపారు. రోడ్ల నిర్మాణం కోసం శాఖల వారీగా మరో రూ. 45కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మహా జాతరకు 107రోజుల సమయం ఉండగా 90 రోజుల్లో పనులు పూర్తి చేయాలని అధికారులను మంత్రులు ఆదేశించారు. కాంట్రాక్టర్లను వెంటనే పనులు ముమ్మరం చేయాలని సూచించారు.

కాగా మేడారం దేవస్థానం శాశ్వత అభివృద్ధి పనులను 100రోజుల్లో పను లు పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారని మంత్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పనుల్లో అధికారులు వేగం పెంచాలన్నారు. పనుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ మేరకు మ్యాప్‌ల ద్వారా పనుల తీరును పరిశీలించారు.

నేడు మానుకోటకు ఏఐసీసీ అబ్జర్వర్ రాక

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష ఎన్నికల ప్రక్రియలో భాగంగా మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈనెల 14న ఉదయం 10:30 గంటలకు నిర్వహించే సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమానికి ఏఐసీసీ పరిశీలకులు దేబాసిస్ పట్నాయక్ టీపీసీసీ అబ్జర్వర్లు శంకరయ్య, పి.మహిపాల్‌రెడ్డి, జూవ్వాడి ఇంద్రారావు, ఎమ్డీ. అవేజ్, శ్రీకాంత్ యాదవ్, జిల్లాలోని ఎంపీ, ఎమ్మెల్యేలు హాజరు కానున్నారని డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, డీసీసీ బాధ్యులు, ఆఫీస్ బేరర్లు, టీపీసీసీ సభ్యులు, బ్లాక్ ,మండల అధ్యక్షుడు, పట్టణ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నేతలు , ఎస్సీ, ఎస్టీ, బీసీ , కిసాన్, మైనార్టీ నేతలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్లు హాజరు కావాలని కోరారు.

కుల వివక్షతోనే ఐపీఎస్ అధికారి బలవన్మరణం

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) :కుల వివక్ష అనుమానాన్ని తట్టుకోలేక హర్యానాలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దళిత ఐపీఎస్ అధికారి పోరన్‌కుమార్ ఆత్మహత్య చేసుకోవడం విచారకరమని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఘటనపై తక్షణమే సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఉన్నత స్థాయి దళిత అధికారికి ఇంతటి అవమానం జరిగితే సామాన్యుల పరిస్థితేంటని ప్రశ్నించారు. దీనిని ప్రతీ ఒక్కరు ఖండించాలని విజ్ఞప్తి చేశారు.

'మేడారం అభివృద్ధిపై ఆరోపణలు మానుకోవాలి'

కొత్తగూడ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీల ఆరాధ్య దేవతలు శ్రీసమ్మక్క, సారక్కలు కొలువైన మేడారం జాతరలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులపై ములుగు జిల్లా మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ బడే నాగజ్యోతి చేస్తున్న అసత్యపు ఆరోపణలు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య హితువు పలికారు. కొత్తగూడలో సారయ్య మాట్లాడుతూ మేడారంలో దోపిడీ మంత్రుల కాంట్రాక్ట్ టెండర్‌లు అంటూ బడే నాగజ్యోతి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని పేర్కొన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మేడారం జాతరలో ఏమి అభివృద్ధి పనులు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. మంత్రి సీతక్కపై అసూయతో విష ప్రచారం చేస్తూ జాతరలో అభివృద్ధి పనులను అడ్డుకోవాలని చూస్తే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉరుములు.. మెరుపులు

(5వ పేజీ తరువాయి)

ప్రవహిస్తోంది. తేజావత్ రాంసింగ్‌తండా శివారులోని అమృతం డాకు చెందిన బోడ శంకర్ ఐదెకరాల వరి పొలం నేలవాలింది. మర్రిమిట్ట జాతీయ రహదారిపై కొంతమంది రైతులు మొక్కజొన్నలు ఆరబెట్టుకోగా.. వర్షానికి కొంతభాగం కొట్టుకుపోయింది. చిన్నగూడూరు మండలంలోని ఆకేరువాగు ఉధృతంగానే ప్రవహిస్తోంది. డోర్నకల్ మండలంలోని మున్నేరువాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. తాళ్లసంకీస వద్ద రోడ్డుపై నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మధ్యాహ్నం వర్షం తగ్గుముఖం పట్టడంతో యథావిధిగా రాకపోకలు కొనసాగాయి. మరోవైపు ప్రజలు వలలు చేపలు పడుతూ.. ఉత్సాహంగా కన్పించారు. అయితే డోర్నకల్, మహబూబాబాద్, కేసముద్రంలో ఎప్పుడు లేనంతగా భారీ శబ్దాలతో పిడుగులు పడడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. మహబూబాబాద్‌లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కేసముద్రం వైపు వెళ్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ పీఎస్ఆర్ గార్డెన్ వద్ద ఆగి రోడ్డుపై ప్రవహిస్తున్న వరదను పరిశీలించారు. అక్కడ ఉన్న కల్వర్టు చెత్తాచెదారంతో పూడుకుపోవడం, చెలకల్లో మట్టి పేరుకుపోయి వరద రోడ్డుపైకి రావడంతో మునిసిపల్ సిబ్బందిని పిలిచి కల్వర్టు కింద చెత్తాచెదారం, మట్టి లేకుండ శుభ్రం చేసి నీరుపోయే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంగారంలో మొక్కజొన్న పంటలు నేలవాలి పడిపోయాయి. కోమట్లగూడెం-కాకినాగారం మధ్య చెరువు అలుగుపోస్తుండడంతో ప్రజలు అటుగా వెళ్లకుండ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మరిపెడ మండలంలో ప్రవహిస్తున్న ఆకేరు, పాలేరు వాగులు మాములుగానే ప్రవహిస్తున్నాయి. నెల్లికుదురు మండలంలో కూడ రాత్రి పిడుగులతో దద్దరిల్లింది. భారీ శబ్దాలు రావడంతో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రాలేదు. తొర్రూరు మండలంలోని అచ్చితండాలో వరి నేల వాలింది. గార్ల మండలంలోని పాకాల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. రాంపురం, మద్దివంచ, గొల్లచర్ల, పులిగుట్టతండ, కొత్తతండ, రాముతండాకు రాకపోకలు నిలిచిపోయాయి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

వాతావరణ సూచనల ప్రకారం.. జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలోనే ఉంటూ నిత్యం పరిస్థితిని గమనించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకుని ప్రజల సౌకర్యార్థం అన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వివిధ విభాగాల అధికారులందరూ సమన్వయంతో ముందస్తు చర్యలు తీసుకోని ఎలాంటి విపత్కార పరిస్థితులైన ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. విపత్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం ద్వార సమస్యలు పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ



విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను పంపిణీ చేస్తున్న రవిచందర్‌రెడ్డి విజిత దంపతులు

కేసముద్రం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లపూసపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం మహబూబాబాద్ లయన్స్‌క్లబ్ పాస్ట్ జడ్‌సీ రావుల రవిచందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ విజిత దంపతుల మనుమరాలు మహికారెడ్డి పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలను అందజేశారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మానుకోట క్లబ్ జడ్‌సీ మాధవపెద్ది వెంకట్‌రెడ్డి, రంగారెడ్డి, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు గొర్రె వెంకన్న, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇనుగుర్తి పాఠశాలలో..

ఇనుగుర్తి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి జడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలకు సోమవారం గంజి రాంరెడ్డి కళావతి ట్రస్ట్ ఆధ్వర్యంలో లైబ్రరీకి అవసరయ్యే రూ.30వేల విలువైన పుస్తకాలను వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవీందర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలకు ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ కోసం ఇద్దరు ఉపాధ్యాయులను నెలకు రూ.10వేల చొప్పున వేతనాన్ని తమ సొంత ఖర్చులతో అందించి నియమించినట్లు రాంరెడ్డి కుమారులు గంజి రాజేందర్‌రెడ్డి, జితెందర్‌రెడ్డిలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో జంగా రూపారాణి, పీఎస్‌హెచ్‌ఎం వీరన్న, మాజీ సర్పంచ్ దార్ల రాంమూర్తి, బొబ్బిలి మహేందర్‌రెడ్డి, గుజ్జునూరి బాబురావు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల ఒకేషనల్ ఇంటర్న్‌షిప్



ఒకేషనల్ ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకున్న విద్యార్థులతో మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణభాను

డోర్నకల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మండలం చిలుకోడులోని మోడల్‌స్కూల్ విద్యార్థులకు పదిరోజుల పాటు ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌ను మహబూబాబాద్‌లోని రాజామాత స్టూడియోలో శిక్షణ కార్యక్రమం తీసుకున్నారు. ఫోటోగ్రఫీ, కెమెరా ఆపరేటింగ్ టెక్నాలజీ, లైటింగ్ టెక్నిక్స్, ఇమేజ్ ఎడిటింగ్ తదితర అంశాలలో ప్రతిరోజు 8 గంటల పాటు శిక్షణ ఇచ్చినట్లు ప్రిన్సిపాల్ చావ కృష్ణభాను తెలిపారు. ఈ శిక్షణను ఎన్‌సీహెచ్ ఫణికమల్ కో ఆర్డినేటర్‌గా వ్యవహరించినట్లు తెలిపారు. ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ ట్రేడ్ విద్యార్థులకు ఫుట్‌బాల్ క్రీడలో బేసిక్ ఫుట్‌బాల్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీ గోవర్ధన్, వీరబాబులు కో ఆర్డినేటర్లు వ్యవహరించినట్లు కృష్ణభాను తెలిపారు. ఇంటర్న్‌షిప్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ప్రొఫెషనల్ అనుభవంతో పాటు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ మెరుగుపడుతుందని తెలిపారు.

ఆకేరులో ట్రాక్టర్ బోల్తా.. తప్పిన ప్రమాదం

నర్సింహులపేట (మహబూబాబాద్ క్రైం), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నర్సింహులపేట మండలం ముంగిమడుగు ఆకేరు వాగులో ఇసుక ట్రాక్టర్ బోల్తాపడి ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకేరు వాగులో ఇసుక తరలించేందుకు సోమవారం ఓ ట్రాక్టర్ వెళ్లింది. ట్రాక్టర్‌లో ఇసుక లోడు చేసి ఆకేరు నుంచి బయటకు వెళ్తున్న క్రమంలో ఆ ట్రాక్టర్ ఆకేరులో దిగబడింది. మరో రెండే ట్రాక్టర్ ఇంజన్లు కట్టి తాళ్లతో గుంజుతున్న సమయంలో ఒక ఇంజన్ ప్రమాదవశాత్తు పల్టీకొటినట్లు తెలిపారు. ఈ ఘటనలో ప్రమాదం నుంచి డ్రైవర్ తృటిలో తప్పించుకొని స్వల్ప గాయాలతో బయట పడినట్లు తెలిపారు. జోరు వానలో సైతం ఆకేరు వాగులో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో సోమవారం జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా అండర్-14 కబడ్డీ పోటీల్లో రెడ్యాల ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థి గుగులోతు చరణ్ అత్యంత ప్రతిభ కనపరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం డి.సక్రునాయక్, పీడీ ధారవత్ మోహన్‌నాయక్ తెలిపారు. ఈ నెల 14,15 తేదీల్లో ములుగు జిల్లా జాకారంలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో చరణ్ ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు నుంచి పాల్గొంటారని చెప్పారు. వెంకన్న, లక్ష్మీదేవి, సంధ్యారాణి, లక్ష్మయ్య శ్రీనివాస్, సైదులు, అరుణ్‌కుమార్, రాజు, అంజయ్య ఉదయ్‌కుమార్ , ఇస్మాయిల్ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఆర్మీ జవాన్‌కు సన్మానం

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంబాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి, దేశ సైనికుడిగా 24 ఏళ్ల పాటు సేవలదించి పదవీ విరమణ పొందిన కొలిశెట్టి సుధా కర్‌ను సోమవారం ఘనంగా సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం గిరిజ మాట్లాడారు. రిటైర్డ్ ఆర్మీ జవాన్ సుధాకర్ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం పని చేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని చెప్పారు. అనంతరం రిటైర్డ్ ఆర్మీ జవాన్ సుధాకర్‌తో పాటు చిత్ర డైరెక్టర్ గుర్రాల ఉదయ్‌ను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం రామసహాయం శ్రీధర్‌రెడ్డి, కాసం శ్రీనివాసరావు, తిరుపతి, శిబారాణి, మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, వీరభద్రం, వెంకటేశ్వర్లు, కవిత, కొలిశెట్టి వెంకన్న పాల్గొన్నారు.

పాకాల వాగు బ్రిడ్జికి బీటలు



బీటలు వారిన పాకాల బ్రిడ్జి

గూడూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : సుమారు గత 30 ఏళ్ల క్రిందట నిర్మించిన గూడూరు పాకాల వాగు బ్రిడ్జి శిథిలావస్థకు చేరి బీటలు వారాయి. ఈ బ్రిడ్జి ద్వారా గూడూరు నుంచి కేసముద్రం, నెక్కొండ మండలాలకు రాకపోకలు జరుగుతాయి. వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు కొనసాగిస్తున్నాయి. అధికారులు పరిశీలనకే పరిమితమయ్యారు. దాని స్థానంలో కొత్త బ్రిడ్జిని నిర్మించకపోవడం, బీటలు వారిన బ్రిడ్జికి మరమ్మతులు చేయకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ ప్రయాణికులు రాకపోకలు కొనసాగిస్తున్నారు.

ఈ నెల 18న ముసలమ్మ జాతరలో వేలం

కొత్తగూడ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుంజేడు ముసలమ్మ జాతరలో ఈ నెల 18న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో శేషగిరి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొబ్బరికాయలు, పూజ సామాను, ఫోటోలు అమ్ముకునే హక్కు, శీతల పానియాలు, కిరాణం సామాను అమ్ముకునే హక్కు కోసం వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు ఈ నెల 17 సాయంత్రం 4 గంటల వరకు శ్రీముసలమ్మ జాతరలో టెండర్ ఫారాలు పొందాలని సూచించారు. 18న జాతరలో బహిరంగా వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

డోర్నకల్‌లో నల్లబెల్లం పట్టివేత

డోర్నకల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) :డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని బాబుజగ్జీవన్‌రాం విగ్రహం సమీపంలో ఓ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నట్లు డోర్నకల్ ఎస్సై వంశీధర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. డోర్నకల్ ఎస్సై ఖాదర్‌పాషా ఆదివారం జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో అటుగా వచ్చిన ఓ వాహనాన్ని తనిఖీ చేయగా.. వాహనంలో 45 బస్తాల నల్లబెల్లంతో పాటు 5 కిలోల పటిక 15 లీటర్ల గుడుంబా గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. రవాణా ఉపయోగించిన మినీ ట్రాలీ వాహనాన్ని స్వాధీనం చేసుకుని డ్రైవర్ వడ్డె రాజును అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా కురవి మండలానికి చెందిన బానోత్ రెడ్యా అనే వ్యక్తి హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో బెల్లం కొనుగోలు చేసి తమ వాహనంలో తరలించినట్లు చెప్పారు. వాహన యాజమానితో పాటు బెల్లం సరఫరా చేసిన సంతోష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రతిభకు పేదరికం అడ్డు కాదు



గ్రూప్-1 విజేత విష్ణును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కురవి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రతిభకు పేదరికం అడ్డుకాదని హెచ్‌ఎం సత్యనారాయణచారి అన్నారు. కురవి మండలం మోదుగులగూడెం జడ్పీఎస్ఎస్‌లో బయాలజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గూడెల్లి విష్ణు ఇటీవల ప్రకటించిన గ్రూప్-1 ఫలితాల్లో ఎంపీడీవో ఉద్యోగం సాధించారు. ఈ సందర్భంగా సోమవారం విష్ణును పాఠశాలలో ఘనంగా సన్మానించారు. చిన్నప్పటి నుంచి కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగం సాధించిన విష్ణును విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లత, ఇందిరా, సలీం, రజిత, భాగ్యలక్ష్మి, విష్ణు, రమేష్, బాలాష్టి రమేష్, వెంకన్న, లక్మా, బీరయ్య, అనితారాణి పాల్గొన్నారు.

పాత్రికేయుల కుటుంబానికి పరామర్శ

చిన్నగూడూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులు గాడిపెల్లి మధు, శ్రీహరి, యాదగిరి, శేఖర్‌ల మాతృమూర్తి దేవకమ్మ చిన్నగూడూరులో ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న మానుకోట మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత సోమవారం చిన్నగూడూరులో దేవకమ్మ కుమారులను పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కవిత వెంట బీఆర్ఎస్ నాయకులు ముత్యం వెంకన్న, దారాసింగ్ తదితరులు ఉన్నారు.

జేవీఆర్ హెచ్‌ఆర్ఎస్ ఎంప్లాయీస్ యూనియన్ ఎన్నిక

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) :మల్యాల జేవీఆర్ హెచ్‌ఆర్ఎస్ టైమ్‌స్కేల్ ఎంప్లాయీస్ యూనియన్‌ను సోమవారం ఎన్నుకున్నారు. ఆ సంఘం అధ్యక్షులుగా నిదానపల్లి శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా షేక్.ఇమామ్‌ను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా బి.విజయసారథిరెడ్డి, గౌరవ సలహాదారులుగా రేషపల్లి నవీన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా లింగ్యానాయక్, ఉపాధ్యక్షులుగా శ్రవణ్, ఎల్లయ్య, హుస్సేన్, సహాయ కార్యదర్శిగా చింతకాయల వెంకన్న, లచ్చమ్మ, కార్యవర్గ సభ్యులుగా షైబి, యాకమ్మ, సూరయ్య, కోశాధికారిగా ఐలమ్మ ఎన్నికయ్యారు.

ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ పంపిణీ

కేసముద్రం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం స్టేషన్ జడ్పీ హైస్కూల్లో సోమవారం నేషన్స్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేషనల్ మెరిట్ కం మీన్స్(ఎన్ఎం ఎంఎస్) స్కాలర్‌షిప్ పరీక్ష కోసం రూ.5,500 విలువగల స్టడీ మెటీరియల్‌ను 15 మంది విద్యార్థులకు హెచ్‌ఎం బందెల రాజు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యారుల కోసం 15 ఏళ్లుగా ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మోహన్ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. విద్య, ఉపాధి అవకాశాల కోసం అనేక ప్రోత్సాహకాలు, మార్గదర్శకత్వాన్ని విద్యార్థులకు, నిరుద్యోగులకు ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు జి.శ్రీనివాస్, బి.విజయ్ చందర్, జి.కృష్ణవేణి, జి.కుమార స్వామి, బి.మదన్‌మోహన్, ఆర్.యాదగిరి, కె.శ్రీనివాస్, భద్రాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పని చేసి గుర్తింపు పొందాలి



ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌తో పదోన్నతి పొందిన ఏఎస్సైలు

మహబూబాబాద్ క్రైం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పదోన్నతి పొందిన పోలీసు అధికారులు నిబద్ధతతో పని చేసి సమాజంలో గుర్తింపు పొందాలని జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. ఖమ్మం కమిషనరేట్ పరిధిలో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేసిన ఎం.కృష్ణమూర్తి, వి.లక్ష్మయ్య, ఎం.గౌస్‌లు ఏఎస్సైగా పదోన్నతిపై మహబూబాబాద్ జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా సోమవారం ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అధికారులు విధుల్లో నిబద్ధత పాటించాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. పోలీసు సిబ్బంది ఉన్నారు.

మొక్కజొన్న కేంద్రాలను ఏర్పాటు చేయాలి

బయ్యారం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మొక్కజొన్న పంట మార్కెట్‌కు వచ్చి నెల రోజులు కావొస్తున్నా నేటికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం శోచనీయమని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మార్కెఫెడ్ ద్వారా వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎంఎల్)- న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య డిమాండ్ చేశారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకై సోమవారం స్థానిక తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలకు తడిసిన మొక్కజొన్న పంటను సైతం ప్రభుత్వమే కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలు లేకపోవడాన్ని ఆసరగా మలుచుకుంటున్న ప్రైవేట్ వ్యాపారులు అక్రమ కొనుగోళ్లకు పాల్పడుతూ రైతులను అందినకాడికి దోచుకుంటూ దోపిడికి గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ పక్క యూరియా కొరతతో తీవ్ర ఇబ్బంది పడుతున్న రైతు లు మరో పక్క పంట విక్రయ విషయంలో అనేక కష్టాలకోర్చాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మురళీకృష్ణ, బిక్షం, నర్సింహా, వీవరభద్రం, నాగేశ్వరరావు, లింగన్న, రాంబాబు, వెంకటేశ్వర్లు, రాము, శోభన్ తదితరులు పాల్గొన్నారు.



బయ్యారం తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎన్డీ నేతలు

మహిళలకు నాయకత్వ శిక్షణ ఇవ్వాలి

● ఏఐఎఫ్‌టీవో జాతీయ ఉపాధ్యక్షురాలు గీత

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మహిళలకు నాయకత్వ శిక్షణలు ఇవ్వాలని అఖిల భారత ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షురాలు నూకల గీత అన్నారు. ముంబాయిలో సోమవారం నిర్వహించిన జాతీయ మహిళా కమిటీ వర్క్‌షాపునకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. .సమాజాభివృద్ధి కోసం ఏర్పాటు చేస్తున్న వివిధ కమిటీల్లో మహిళల ప్రాతినిధ్యం పెంచాలని, లింగ సమానత్వంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనువైన సమయాల్లో సమావేశాలు నిర్వహించి మహిళలు పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. మహిళలకు గౌరవం, అవకాశం, ప్రోత్సాహం ఇచ్చిన ప్పుడు మాత్రమే సంసలు, సమాజం నిజమైన పురోగతి సాధిస్తాయని పేర్కొన్నారు. మహిళలకు సమాజంలో సముచిత స్థానం ఇచ్చినప్పుడే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. మహిళలు తల్లి, గృహిణి, సంరక్షురాలుగా ఒకేసారి అనేక బాధ్యతలు నిర్వహిస్తున్నారని తెలిపారు.



వర్క్‌షాపులో మాట్లాడుతున్న గీత

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండొద్దు

● మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అధికారులు చూడాలని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ సూచించారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం విద్యుత్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మానుకోట నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో విద్యుత్ సరఫరా, లో వోల్టేజ్ సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం లాంటి అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించిఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అయ్యేలా చూడాలని చెప్పారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్